
# 5. శతక సుధ

కింది బొమ్మను చూడండి, మాట్లాడండి.




SCERT TELANGANA

**ప్రశ్నలు**

1. బొమ్మలో ఎవరెవరున్నారు?
2. ఉపాధ్యాయిని ఏం చెపుతుండవచ్చు? ఊహించండి.
3. ఇట్లాంటి మరికొన్ని మంచి మాటలను పాఠం ద్వారా తెలుసుకొందాం!

**పాఠం ఉద్దేశం**

శతకపద్యాలు సమాజంలోని పోకడలను తెలుపుతాయి. వాటి ఆధారంగా విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందింపజేసి ఉత్తమ పౌరులుగా తయారుజేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

## పాఠ్యభాగ వివరాలు


ఈ పాఠం శతక ప్రక్రియకు చెందినది. శతకం అంటే నూరు లేదా నూటికిపైగా ఉండే పద్యాలతో ఉండేది. శతకాల్లోని పద్యాలకు 'మకుటాలు' ఉంటాయి. ఈ పాఠంలోని పద్యాలు సుమతి, వేమన, తెలుగు బాల, తెలుగుపూలు శతకాల్లోనివి.

## కవి పరిచయం



(13వ శతాబ్దం)

ఈ పాఠంలోని 1, 2 పద్యాలు సుమతి శతకంలోనివి. వీటిని రాసింది బద్దెన. ఈయన వేములవాడను పాలించిన చాళుక్యరాజైన భద్రభూపాలునిగా ప్రసిద్ధుడు. ఈయన సుమతీ శతకంతోపాటు 'నీతి శాస్త్రముక్తావళి' అనే గ్రంథాన్ని రాశాడు.



(17వ శతాబ్దం)

ఈ పాఠంలోని 3, 4 పద్యాలు వేమన శతకంలోనివి. వీటిని రాసింది వేమన. ప్రజాకవిగా ప్రసిద్ధుడైన వేమన కడప ప్రాంతానికి చెందినవాడు. ఈయన రాసిన పద్యాలు తెలియని తెలుగువారుండరు.



(04-08-1912
21-06-1992)

ఈ పాఠంలోని 5వ పద్యం తెలుగుబాల శతకం లోనిది. రాసింది జంధ్యాల పాపయ్యశాస్త్రి. ఈయన గుంటూరు జిల్లా వాసి. కరుణశ్రీ, ఉదయశ్రీ వీరి ప్రసిద్ధ రచనలు.



(01-05-1925
16-10-1971)

ఈ పాఠంలోని 6వ పద్యం తెలుగుపూలు శతకంలోనిది. దీనిని రాసింది నార్ల చిరంజీవి. ఈయనది కృష్ణాజిల్లా. ఈయన ఎర్రగులాబీ, తెలుగుపూలు, పేనూ-పెసర చేను లాంటి రచనలు చేశాడు.

SCERT TELANGANA

## I

★ తనవారు లేని చోటను
జన వించుక లేనిచోట జగడము చోటన్
అనుమానమైన చోటను
మనుజునకున్ నిలువదగదు మహిలో సుమతీ!





★ వినదగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపదగున్
కనికల్ల నిజము తెలిసిన
మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ!

**ఆలోచించండి – చెప్పండి**

1. పై పద్యాలను కంఠస్థం చేయండి, భావం చెప్పండి.

## II

తల్లిదండ్రి మీద దయలేని పుత్రుండు
పుట్టనేమి? వాడు గిట్టనేమి?
పుట్టలోని చెదలు పుట్టదా? గిట్టదా?
విశ్వదాభిరామ వినురవేమ!



SCERT TELANGANA

వేరు పురుగు చేరి వృక్షంబు చెరచును
చీడ పురుగు చేరి చెట్టు చెరచు
కుత్సితుండు చేరి గుణవంతు చెరచురా!
విశ్వదాభిరామ వినురవేమ!



**ఆలోచించండి - చెప్పండి**

1. పై పద్యాలను కంఠస్థం చేయండి, భావం చెప్పండి.

## III



తనకు తగని పిచ్చిపనులకు పోనేల
అడుసు త్రొక్కి కాలు కడుగుటేల?
కోతి మేకు పీకి కోల్పోయె ప్రాణాలు
లలిత సుగుణ జాల! తెలుగు బాల!

చదువురాని వాని జనులు మెచ్చరు సుమ్మ
చదువునేర్చువాని జగము మెచ్చు
దేశకాల గతులు తెలియగా వచ్చును
తెలియు మంచి చెడ్డ తెలుగు బిడ్డ!



**ఆలోచించండి - చెప్పండి**

1. పై పద్యాలను కంఠస్థం చేయండి, భావం చెప్పండి.

SCERT TELANGANA

## భావాలు

1. ఓ బుద్ధిమంతుడా! తనవారు లేనిచోట, మాట చెల్లుబడి కానిచోట, తగవులాడుకునే చోట, అనుమానం ఉన్నచోట మనిషి ఉండకూడదు.

2. ఓ బుద్ధిమంతుడా! ఎవ్వరు చెప్పినా వినాలి. విన్నవెంటనే తొందరపడకుండా బాగా పరిశీలన చేయాలి. అలా పరిశీలించి అది నిజమో, అబద్ధమో తెలుసుకున్న మనిషే నీతిపరుడు.

3. తల్లిదండ్రుల మీద ప్రేమలేని కొడుకు పుట్టినా ఒక్కటే! చచ్చినా ఒక్కటే! పుట్టలోపల చెదలు పుడ్తుంది, చస్తుంది. అట్లాగే తల్లిదండ్రుల మీద ప్రేమలేని కొడుకు పుట్టలోని చెదలుతో సమానం.

4. వేరుకు పట్టిన పురుగు చెట్టును తెలియకుండా పాడుచేస్తుంది. చీడపురుగు అతి తొందరగా చెట్టును నశింపజేస్తుంది. అలాగే మంచివాడిని చేరిన చెడ్డవాడు అతడిని కూడా చెడగొడతాడు.

5. ఒక వడ్రంగి చెక్క మొద్దును చీల్చడానికి పెద్ద మేకును దించాడు. చెక్కమొద్దు సగం చీలింది. పనిని మధ్యలో వదిలి వడ్రంగి అన్నం తినడానికి వెళ్ళాడు. ఇంతలో ఒక కోతి అక్కడికి వచ్చి ఆడుతూ మొద్దుపై కూచుంది. దాని తోక చీలిక మధ్యలోకి వెళ్ళింది. ఊరికే కూర్చోక ఆ కోతి మేకును పీకింది. దాని తోక ఆ మొద్దు చీలికలో చిక్కుకుపోయింది. ఆ బాధతో కోతి విలవిలలాడుతూ చనిపోయింది. తనకు తగని పనులకు ఎవ్వరైనా పోకూడదు. బురదను తొక్కుటెందుకు? కాలు కడిగేదెందుకు? ఎవరి హద్దుల్లో వారుంటే మంచిది.

6. ఓ తెలుగు బిడ్డా! చదువురాని వాడిని ఎవ్వరూ మెచ్చుకోరు. చదువుకుంటున్న వాడిని అందరూ మెచ్చుకుంటారు. చదువుకోవడంవల్ల దేశకాలాలకు సంబంధించిన విషయాలన్నీ తెలుస్తాయి. అంతేకాదు ఏది మంచి? ఏది చెడు? అనేవి తెలుస్తాయి.

SCERT TELANGANA

# ఇవి చేయండి

## I వినడం - ఆలోచించి మాట్లాడడం

అ) పాఠంలోని పద్యాలను శతక పద్యాలంటారు కదా? ఇలాంటి పద్యాలను ఎందుకు నేర్చుకోవాలి?

ఆ) శతక పద్యాల వల్ల తెలుసుకున్న నీతులను చెప్పండి.

## II ధారాళంగా చదువడం - అర్థం చేసుకోవడం

### అ) కింది భావాలను తెలిపే పద్యపాదాలను పాఠంలో గుర్తించి రాయండి.

1) విన్నవెంటనే తొందర పడకుండా బాగా పరిశీలన చేయాలి.

______________________________

2) అనుమానం ఉన్నచోట మనిషి ఉండకూడదు.

______________________________

3) వేరు పురుగు చెట్టును పాడుచేస్తుంది.

______________________________

4) చదువుకుంటున్న వాణ్ణి అందరూ మెచ్చుకుంటారు.

______________________________

### ఆ) కింది పద్యాన్ని చదివి ఖాళీలు పూరించండి.

ఉపకారికి నుపకారము

విపరీతము గాదు సేయ వివరింపంగా

అపకారికి నుపకారము

నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ!

1) ______________ కి ఉపకారం చేయడం విపరీతం కాదు.

2) అపకారం చేసిన వారికి కూడా ______________ చేయాలి.

3) ఈ పద్యానికి మకుటం ______________.

4) ఈ పద్యం ______________ శతకం లోనిది.

SCERT TELANGANA

## III స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు మూడేసి వాక్యాలలో జవాబులు రాయండి.**

1) మనిషి ఎలాంటి ప్రదేశాలలో ఉండకూడదు? ఎందుకు?

2) 'నీతి పరుడు' అని ఎవరిని అంటాం?

**ఆ) కింది ప్రశ్నకు ఆరు వాక్యాల్లో జవాబు రాయండి.**

1) శతక పద్యాలలోని గొప్పదనం ఏమిటి? వీటివల్ల కలిగే మేలు ఏమిటి?

SCERT TELANGANA

## IV సృజనాత్మకత

అ) పాఠంలోని ఐదవ పద్యం ఆధారంగా కథను సొంతమాటల్లో రాయండి.

## V పదజాలం

అ) ఒకే అర్థం వచ్చే పదాలను పర్యాయపదాలు అంటారు. కింది వాక్యాలలో ఒకే అర్థం వచ్చే పదాల కింద గీత గీయండి.

1) ఈ భూమిపైన ఎన్నో జీవరాశులు ఉన్నాయి. వివిధ రసాయనాలు వాడటంవల్ల ధరణి కలుషితం అవుతున్నది. ఈ వసుధను మనం కాపాడుకోవాలి.

2) అబద్ధాలాడటం మహాపాపం. కల్లలాడేవాడు మోసకారి.

3) బురదలో పుట్టినా తామరాకుకు అడుసు అంటదు.

4) ఎవ్వరితో జగడం పెట్టుకోవద్దు. కొట్లాట అందరినీ దూరం చేస్తుంది.

5) అనుమానం వచ్చినపుడు ఉపాధ్యాయుడిని అడిగితే సందేహం తీరుతుంది.

ఆ) కింది వాక్యాల్లో గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి.

1) మనుజుడిలో మంచితనం ఉండాలి.

మనుజులు = ______________________

2) పుట్టిన ప్రతిజీవి గిట్టక తప్పదు.

గిట్టడం = ______________________

3) కుత్సితునితో స్నేహం పనికిరాదు.

కుత్సితుడు = ______________________

4) అడుసు త్రొక్కినప్పుడు కాళ్లు కడుగుకోవాల్సిందే.

అడుసు = ______________________

5) ఈ జగము నందు మంచిని పెంచాలి.

జగము = ______________________

SCERT TELANGANA

ఇ) కింది పదాలను జంట పదాలు అంటారు. ఇట్లాంటి పదాలు మరికొన్ని రాయండి.

ఉదా: మంచి – చెడూ ముందు – వెనుకా

______________ ______________

______________ ______________

______________ ______________

______________ ______________

______________ ______________

## VI భాషను గురించి తెలుసుకుందాం!

అ) కింది వాక్యాలు చదువండి. గీత గీసిన పదాలను గమనించండి.

1) <u>గణేశ్</u> మైదానానికి వెళ్ళాడు. <u>అతడు</u> ఆటలు ఆడాడు.

2) <u>అరుణ</u> వంట చేస్తుంది. <u>ఆమె</u> బొమ్మలు కూడా గీస్తుంది.

3) <u>తాత</u> పూజ చేశాడు. <u>ఆయన</u> ప్రసాదం ఇచ్చాడు.

4) <u>సురేశ్</u>, <u>మంజుల</u>, <u>శారద</u> కలిసి బజారుకు వెళ్ళారు. <u>వాళ్ళు</u> అక్కడ నోటు పుస్తకాలు కొన్నారు.

5) <u>ఆవు</u> గడ్డి మేసింది. <u>అది</u> పాలు ఇచ్చింది.

ఇప్పుడు ఈ వాక్యాల ఆధారంగా కింది పట్టిక పూరించండి.

| వాక్యం | పేరు (నామవాచకం) | పేరుకు బదులుగా వాడిన మాట |
|---|---|---|
| 1 | గణేశ్ | అతడు |
| 2 | ______________ | ఆమె |
| 3 | ______________ | ______________ |
| 4 | సురేశ్, మంజుల, శారద | ______________ |
| 5 | ______________ | అది |

SCERT TELANGANA

పక్కపేజీలోని పట్టిక ద్వారా పేర్లకు లేదా నామవాచకాలకు బదులుగా వాడే పదాలు అదే అర్థాన్ని ఇస్తున్నాయని తెలుసుకున్నారు కదా! ఇట్లా నామవాచకాలకు బదులుగా వాడే పదాలను **"సర్వనామాలు"** అంటారు.

ఆయన, అతడు, ఆమె, వారు, ఈయన, ఇతడు, ఈమె, వీరు, అది, అవి,

ఇది, ఇవి, నేను, మేము / మనము, నీవు, మీరు ఇవన్నీ సర్వనామాలే!

**ఆ) కింది వాక్యాలలోని ఖాళీలను సరైన సర్వనామ పదాలతో పూరించండి.**

1) అబ్దుల్‌కలాం గొప్ప శాస్త్రవేత్త. __________ మన దేశానికి రాష్ట్రపతి అయ్యాడు.

2) రవి, రాణి, రాము మంచి స్నేహితులు. __________ ముగ్గురు కలిసి సర్కస్‌కు వెళ్ళారు.

3) మామిడికాయలు పుల్లగా ఉంటాయి. __________ పండితే తియ్యగా అవుతాయి.

4) హరిత సినిమాకు వెళ్ళింది. అక్కడ __________కు గీత కలిసింది.

5) నవీన్ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. __________ రోజూ కథల పుస్తకాలు చదువుతున్నాడు.

6) రాకేశ్! __________ ఊరి నుండి ఎప్పుడు వచ్చావు?

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1) | శతక పద్యాలవల్ల తెలుసుకున్న నీతులను చెప్పగలను. | ఔను / కాదు |
| 2) | భావాలకు అనుగుణంగా పద్యపాదాలను గుర్తించగలను. | ఔను / కాదు |
| 3) | శతక పద్యాల గొప్పతనం గురించి రాయగలను. | ఔను / కాదు |
| 4) | శతక పద్యం ఆధారంగా చిన్న కథను రాయగలను. | ఔను / కాదు |

**సూక్తి**

"నీతి, సద్గుణాలు వజ్రాలకన్నా విలువైనవి.
అవి మనిషికి సంతృప్తినిస్తాయి.
మనీషిగా తీర్చిదిద్దుతాయి."



SCERT TELANGANA